
నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, గురువారం 3 అక్టోబర్ 2024 | NIZAMABAD

# నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు



- అమ్మ అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే
- తొమ్మిది రోజుల పాటు పూజ లందుకోనున్న దుర్గాదేవి
- మాలధారణకు సిద్ధమైన దుర్గామాత భక్తులు

సుభాష్‌నగర్, అక్టోబర్ 2: దసరా.. హిందువులకు ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు.. పదో రోజు విజయదశమిని కలిపి దసరా అంటారు. ప్రధానంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అంటారు. శరదృతువులో వచ్చే పండుగ కాబట్టి ఈ పేరు వచ్చింది. నవరాత్రి అనే పదం శబ్దార్థ ప్రకారంగా.. సంస్కృతంలో తొమ్మిది రాత్రులని అర్థం. ఈ తొమ్మిది రాత్రులు.. పది రోజుల్లో.. తొమ్మిది రూపాల్లో ఉన్న శక్తి (అమ్మవారు)ని ఆరాధిస్తారు. కొందరు ఈ పండుగ మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తర్వాత మూడు రోజులు లక్ష్మీదేవిని, ఆ తర్వాత మూడు రోజులు సరస్వతీ మాతకు పూజలు నిర్వహిస్తారు. నవరాత్రుల్లో సామాన్యుల నుంచి యోగుల వరకు అమ్మవారిని పూజిస్తారు. తొమ్మిది రోజుల్లో అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. లోక కల్యాణం కోసం అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తారు. ప్రకృతి ఆధీనంలో ఉండాలని, అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటారు. ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి అందులో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంకాలం రెండుసార్లు భక్తిశ్రద్ధలతో దేవీ మాతకు పూజలు, అర్చనలు చేస్తుంటారు. యువజన మండళ్లు, మహిళా మండళ్ల వారు అమ్మవారి మండపాల వద్ద రాత్రుళ్లు భజనలు, కోలాటాలు ఆడుతుంటారు. బతుకమ్మ ఆటలను ఆడుతూ అమ్మను కొలుస్తారు. చండీ హోమాలు, శ్రీలక్ష్మీగణపతి, దుర్గా రుద్రహోమాలు నిర్వహిస్తారు. మండపాల వద్ద శ్రీలలితా సహస్ర నామ పారాయణాలు, దేవీ ఖడ్గమాల పారాయణాలు చేస్తూ అమ్మవారిని ఆరాధిస్తారు. దశమి పర్వదినాలను జరుపుకోవాలని వేదపండితులు సూచిస్తున్నారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా మాలధారణ వేసుకోవడానికి జిల్లాలో యువకులు సిద్ధమయ్యారు. తొమ్మిది రోజుల పాటు నియమ నిష్ఠలతో ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తుంది.





గాంధీజీకి ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఉమ్మడి జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజామాబాద్‌లో గాంధీ విగ్రహానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, కామారెడ్డిలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## గాంధీ బాటలో నిరసన

స్వాతంత్ర్య సమరంలో గాంధీ చూపిన అహింసా మార్గం యావత్ ప్రపంచానికి చుక్కానిగా నిలిచింది. తెలంగాణ ఉద్యమం సైతం కేసీఆర్ సారథ్యంలో అహింసాయుతంగానే నడిచింది. హింసను ప్రోత్సహించకుండా శాంతియుత పద్ధతిలో తెలంగాణ రాష్ట్ర సాధన పోరు జరగడం వల్లే విజయ తీరాలకు చేరింది. గాంధీ చూపిన శాంతి మార్గాన్ని అనుసరిస్తూ గాంధీ జయంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని శ్రీనగర్ కాలనీవాసులు బుధవారం నిరసన చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకున్నది. శ్రీనగర్ కాలనీలో పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారమార్గం కోరుతూ నిరసన బాట పట్టారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బీటీ రోడ్డు సౌకర్యం, కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు చేపట్టాలని నిరసనదీక్ష చేపట్టారు. సమస్యల పరిష్కారం కోరుతూ చాలా రోజులుగా ప్రజలంతా విన్నపాలు విన్నవిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగంలో చలనం కరువైంది. దీంతో గాంధీ జయంతి రోజునే శ్రీనగర్ కాలనీ వాసులంతా కలిసి శాంతియుతంగా నిరసనకు దిగారు. గాంధీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి తమ ఆందోళలను కొనసాగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.



జిల్లా కేంద్రంలో శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తున్న శ్రీనగర్ కాలనీవాసులు

# మహాత్మా మన్నించు!

- సోషల్ మీడియాలో వికృత చేష్టలు
- గాంధీ మహాత్ముడిపై విద్వేషపు పోస్టులు.
- తప్పుపడుతున్న ప్రజాస్వామ్యవాదులు...



నిజామాబాద్, అక్టోబర్ 2, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహాత్మా గాంధీ జీవితం అన్ని తరాలకు ఆదర్శం. ఆయన మాటలు అనుసరణీయం. బాపు చూపిన మార్గం శిరోధార్యం. మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపితగా ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన జయంతి రోజున సోషల్ మీడియాలో వికృత చేష్టలు రాజ్యమేలాయి. మహాత్ముడిపై అనుచితంగా పోస్టులు పెడుతూ కొంతమంది వ్యక్తులు వికృత క్రీడకు తెర లేపారు. మహనీయుడి జయంతిని పురస్కరించుకుని దేశమంతటా, ప్రతి వాడలోనూ గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళ్లు అర్పించగా.. కొంతమంది తీరు మాత్రం ఆక్షేపణీయంగా మారింది. మహాత్ముడి సేవలను కొనియాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ మహాత్ముడి త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. మరోవైపు వాట్సాప్‌ల్లో మాత్రం అక్టోబర్ 2 ఉదయం నుంచే విద్వేషాన్ని పెంచి పోషించేలా కొంత మంది పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. ఉదయం 8గంటలకే దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా శ్రద్ధాంజలి ఘటించగా.. కొంత మంది చిల్లర పోస్టులతో చెడు ప్రచారానికి ఒడిగట్టడంపై ప్రజాస్వామ్య వాదులందరూ తప్పు పడుతున్నారు. చెడు భావజాల వ్యాప్తితో సమాజంలో ఉద్రిక్తతలకు తావిచ్చేలా వ్యవహరించే వ్యక్తులు, శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

### యథేచ్ఛగా మందు, మాంసం విక్రయాలు

వినాయక్‌నగర్/ కామారెడ్డి/శక్కర్‌నగర్, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలను నిషేధిస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా మద్యం, మాంసం విక్రయాలు కొనసాగాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాకేంద్రాల్లోని పలుప్రాంతాల్లో మాంసం విక్రయించారు. గాంధీ జయంతి రోజున మాంసం విక్రయాలపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారుల తీరుపై మండిపడ్డారు. కామారెడ్డిలో మాంసం దుకాణాల వద్దకు వెళ్లి చెప్పినప్పటికీ యజమానులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సుజాత పోలీసులతో వెళ్లి మాంసం విక్రయ దుకాణాలను మూసివేయించారు.

### చికెన్‌పై ఫినాయిల్ చల్లిన అధికారులు

బోధన్ పట్టణ శివారులో పలు చికెన్ సెంటర్లు తెరిచి ఉంచారు. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా..వారు పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు.విక్రయానికి సిద్ధంగా ఉంచిన చికెన్‌పై ఫినాయిల్ చల్లి పనికిరాకుండా చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు, పోలీసులు హెచ్చరించారు. గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలు జరుపవద్దనే నిబంధనలు ఉన్నా.. వాటిని తుంగలోకి తొక్కి కొన్ని చోట్ల విక్రయాలు బాహాటంగా నిర్వహించారు.



బోధన్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో చికెన్‌పై ఫినాయిల్ పోస్తున్న మున్సిపల్ శానిటరీ సిబ్బంది

# చిన్నారిపై వీధి కుక్కల దాడి

- ముఖం, తలపై గాయాలు
- అల్లాపూర్‌లో ఘటన

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 2: కొన్నిరోజులుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మనిషి కనిపిస్తే చాలు వెంటపడుతున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామంలో విఠల్ రావు కూతురు వాణిశ్రీ బుధవారం ఆరుబయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారి ముఖం, తలపై గాయాలు కావడంతో తల్లిదండ్రులు వెంటనే దవాఖానకు తరలించారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నదని, బయటికి రావాలంటేనే భయపడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. గడిచిన రెండు నెలల్లో ఐదుగురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయని, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి పలు మార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వీధి కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి వాణిశ్రీ

# ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

### జిల్లా జడ్జి సునీత కుంచాల



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల


వినాయక్‌నగర్, అక్టోబర్ 2: తెలిసి కొందరు, తెలియక కొంతమంది చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదని, కానీ ఈ శిక్ష కాలంతో తాము చేసిన తప్పులను తెలుసుకుని ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా జడ్జి సునీత కుంచాల హితవు పలికారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆమె జిల్లా జైలును సందర్శించి, ఖైదీల సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. క్షణికావేశంలో తమ కోపాన్ని అదుపు చేసుకోలేక నేరాలకు పాల్పడిన వారు జైలు జీవితాన్ని గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇక్కడి నుంచి బయటికి వెళ్లిన అనంతరం సమాజంలో మంచి పౌరులుగా తమ జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆనంద్ రావు, జైలర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఊహాగానాలు నమ్మొద్దు!

- త్వరలోనే టీఎన్‌జీవోకు ఎన్నికలు...
- ఎవరూ అయోమయానికి గురికావొద్దు...
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్



నిజామాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీఎన్‌జీవో)కు త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ స్పష్టం చేశారు. టీఎన్‌జీవో సభ్యులెవరూ గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సెప్టెంబర్ 11న నిర్వహించిన కార్యవర్గ సమావేశంలోనే జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తన పదవికి రాజీనామా చేశారని తెలిపారు. కొత్త సభ్యత్వాలతోపాటు తాలూకా స్థాయిలో ఎన్నికలు నిర్వహించిన వెంటనే జిల్లా కార్యవర్గ కూర్పు ఉంటుందని పేర్కొన్నారు. జీఏడీ ఇచ్చిన ఉత్తర్వు మేరకు అలుక కిషన్ రాజీనామా పత్రం తనకు అందిందని, టీఎన్‌జీవో నూతన కార్యకవర్గాన్ని త్వరలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి నియామకం చేపడతామని తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. టీఎన్‌జీవోలో ఏండ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరు, సంఘం బలోపేతానికి పాటుపడిన సభ్యుల పనితీరు ఆధారంగా ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఎవరూ ఎలాంటి అయోమయానికి గురి కావొద్దన్నారు. ఊహాగానాలను పట్టించుకోవద్దని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్లు ఇక ముందు జరుగబోవన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా టీఎన్‌జీవో పని చేయడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నదని తెలిపారు. దసరా అనంతరం నిజామాబాద్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.



ఉత్తునూరు పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

# ఎడపల్లిలో మాడ్రన్ డంపింగ్ యార్డు

ఎడపల్లి, అక్టోబర్ 2 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మాడ్రన్ డంపింగ్ యార్డును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొదటిసారి ఎడపల్లిలో మాడ్రన్ డంపింగ్ యార్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్లాస్టిక్ వ్యర్థాల కట్టలను తయారుచేసి కార్ఖానాలకు విక్రయిస్తారని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు నిర్వహణలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు. మాడ్రన్ యార్డు నిర్వహణ కోసం హైదరాబాద్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో మన్మోహన్ శర్మ, సెక్రటరీ నాగరాజు గౌడ్, సొసైటీ చైర్మన్లు పోల మల్కారెడ్డి, కె.సత్యనారాయణ, జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్, నాయకులు ఎల్లయ్య యాదవ్, బంజ కామప్ప తదితరులు ఉన్నారు.



మాడ్రన్ డంపింగ్ యార్డు పనితీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

# ఉత్తునూరు పీహెచ్‌సీ ఎదుట ఆందోళన

వైద్య సేవలు అందడంలేదని గ్రామస్తుల ధర్నా

రామారెడ్డి, అక్టోబర్ 2: వైద్య సేవలు అందడంలేదంటూ సదాశివనగర్ మండలంలోని ఉత్తునూరు పీహెచ్‌సీ ఎదుట గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, వైద్యురాలు శిరీష వారం రోజుల నుంచి దవాఖానకు రావడంలేదని తెలిపారు. దీంతో పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యాధుల బారిన పడి దవాఖానకు వెళ్తే వైద్య సిబ్బంది దురుసుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇటీవల జ్వరంతో బాధపడుతూ వచ్చిన ఓ వ్యక్తి.. సెలైన్ పెట్టాలని వైద్య సిబ్బందిని అడిగితే దురుసుగా వ్యవహరించారని తెలిపారు. బుధవారం ఉదయం దవాఖానకు వెళ్తే వైద్యులెవరూ లేరని, సమయపాలన పాటించడంలేదన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో హాజరుకావడంలేదని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలో రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ఈ విషయమై డాక్టర్ శిరీషను అడుగగా తాను మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నానని, వ్యక్తి గత సమస్యలతో వారం రోజుల నుంచి సెలవులో ఉన్నట్లు తెలిపారు.

### మెరుగైన వైద్యసేవలందించాలి

ఉత్తునూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు సరైన వైద్యం అందడలేదు. వైద్యులు సకాలంలో రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. సిబ్బందిని అడిగితే డాక్టర్ లేరని, మందు గోళీలు లేవని చెబుతున్నారు. ప్రస్తుతం వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో అధికారులు వెంటనే స్పందించి మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నాం.



-దోడ్లే నరేందర్‌రావు, ఉత్తునూర్ వీడీసీ అధ్యక్షుడు

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



జిల్లా కేంద్రంలోని నామ్‌దేవ్‌వాడలో సాయిబాబా గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉమ్మడి జిల్లాలో బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలు కొలువుదీరాయి. తొలి రోజు బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను అలంకరించారు. సాయంత్రం బతుకమ్మలను ఒకేచోటకు చేరి పాటలతో హోరెత్తించారు.